సాక్షి
తూర్పుగోదావరి

సోమవారం । 22 । సెప్టెంబర్ । 2025



విరాళాల అందజేత

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి కుర్రా పూజ్యశ్రీత రూ.50,001, గోసంరక్షణ నిధికి కుర్రా తమన్వి రూ.50,001 (బాపట్ల) విరాళాలను ఆదివారం అందజేశారు.



వైద్యం... మహాభాగ్యం

క్యాన్సర్ బాధితుల్లో భయాన్ని పోగొట్టి, వారిలో ధైర్యాన్ని నింపేందుకు ప్రపంచ వ్యాప్తంగా ఏటా సెప్టెంబర్ 22న రోజ్ డే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం

II లో

4.11 లక్షల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం రాత్రి 4,11,513 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,200, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.10 అడుగులు ఉంది.

న్యూస్‌రీల్

ఇసుక స్టాక్ పాయింట్ల పరిశీలన



ఆరికిరేవుల ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ దుర్గాప్రసాద్

సాక్షి ఇంపాక్ట్

తాళ్లపూడి (కొవ్వూరు): ఇసుక స్టాక్ పాయింట్లలో జరుగుతున్న దోపిడీపై అధికారులు స్పందించారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఇసుక అమ్మకాలపై ఈ నెల 21న సాక్షి పత్రికలో 'ఉచితంగా దోపిడీ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ మేరకు కొవ్వూరు మండలంలోని ఇసుక స్టాక్ పాయింట్లను తహసీల్దార్ దుర్గాప్రసాద్ పరిశీలించారు. బిల్లులు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాడపల్లి, ఔరంగాబాద్ పడవ ర్యాంపులు మూతపడడంతో స్టాక్ పాయింట్ వద్దకు లారీలు వస్తున్నాయన్నారు. వాటిని పోలీసుల సాయంతో వేరే ప్రదేశంలో పెట్టించడం జరుగుతుందన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద బిల్లుల ప్రకారం మాత్రమే లోడ్ చేస్తున్నారన్నారు. ఇసుక విక్రయాలను టాస్క్ ఫోర్స్ అధికారులు కూడా తనిఖీలు చేస్తున్నారు. ఇసుక ఎటువంటి అసౌకర్యం కలిగినా, టన్నును రూ.160కి మించి విక్రయాలు చేసినా తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరారు.

కార్మికుల పని గంటల పెంపుపై నిరసన



ధవళేశ్వరంలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ధవళేశ్వరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల పని సమయాన్ని 8 నుంచి 10 గంటలకు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద నిరసన తెలిపారు. అసెంబ్లీలో ఆమోదించిన కార్మిక వ్యతిరేక బిల్లును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టి.అరుణ్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్‌లోని అంశాలను రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అమలు చేయడాన్ని ఖండించారు. అసెంబ్లీలో సెప్టెంబర్ 19న ఫ్యాక్టరీలు, షాపులు, సంస్థల్లో పనిచేసే కార్మికుల పని గంటల పెంపును ఆమోదించారన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ నేటి వరకు కనీస వేతనాలు పెంచని కూటమి ప్రభుత్వం.. పని గంటలను మాత్రం పెంచడాన్ని విమర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి పవన్, నాయకులు ఎస్ఎస్ మూర్తి, పూర్ణిమరాజు, రామకృష్ణ, మాచారావు, రమేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు పిండ ప్రదానం



రాజమహేంద్రవరంలో పిండ ప్రదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణారెడ్డి

అనపర్తి: మహాలయ అమావాస్యను పురస్కరించుకుని అనపర్తికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి ఆదివారం మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి పిండ ప్రదానం చేశారు. రాజమహేంద్రవరంలోని కోటిలింగాలరేవులో గోదావరి ఒడ్డున ఈ కార్యక్రమం జరిపారు. అలాగే తన కుమారుడు సురేష్ రెడ్డి, తల్లి బాపాయమ్మతో పాటు సర్ ఆర్థర్ కాటన్, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు, తన రాజకీయ గురువు సత్తి వీర్రెడ్డి, సహచరుడు మోకా సూరిబాబులకు కూడా పిండ ప్రదానం చేశారు.

లోవ దేవస్థానంలో నేటి నుంచి శరన్నవరాత్రులు

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి దేవస్థానంలో సోమవారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు శరన్నవరాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ కమిషనర్, ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు ఆదివారం తెలిపారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని తొమ్మిది రోజులు వేదపండితులు, ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో తలుపులమ్మ తల్లికి ప్రత్యేక అలంకరణలు చేస్తామన్నారు.

రేటు పోటు





ఖండవల్లిలో కొబ్బరికాయల రాశులు (అంతరచిత్రం) కొబ్బరి కాయలు ఒలుస్తున్న కూలీలు

- మార్కెట్‌లో కొబ్బరికి డిమాండ్
- వెయ్యి కాయల ధర రూ.32 వేలు
- రైతుకు అందేది రూ.22 వేలే
- ఖర్చుల పేరుతో వ్యాపారస్తుల కోత

పెరవలి: కొబ్బరి కాయలకు మార్కెట్‌లో మంచి ధర పలుకుతున్నా రైతులకు మాత్రం లాభం ఉండడం లేదు. దళారీలు, వ్యాపారస్తులు కుమ్మక్కై ధరలను తగ్గించేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో వెయ్యి కాయలు రూ.32 వేలు పలుకుతున్నాయి. ఇది మంచి ధరే అయినప్పటికీ రైతులకు దగ్గరకు మాత్రం చేరడం లేదు. దింపు, మోత, ఒలుపు, రవాణా ఖర్చులంటూ వ్యాపారులు కోత విధిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో జరిగిన కుంభమేళా దగ్గర నుంచి ప్రారంభమైన కొబ్బరి ధరల పెరుగుదల నేటికీ కొనసాగుతూనే ఉంది.

నిలకడగా..

కొబ్బరి కాయల ధర నిలకడగా పెరుగుతూ ఉండడం బహుశా ఇదే మొదటిసారి అని రైతులు చెబుతున్నారు. ఎందుకంటే ఈ ఏడాది ప్రారంభం నుంచి ధర పెరగటమే తప్ప తగ్గలేదు. ప్రస్తుతం మార్కెట్‌లో కొబ్బరి కాయల ధర నాణ్యతను బట్టి రూ.30 వేల నుంచి రూ.32 వేలు పలుకుతున్నా రైతులకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోతోంది. ఎందుకంటే వ్యాపారస్తుడే కొబ్బరి దింపు, మోత, రవాణా, ఒలుపు వంటివి అన్ని ఖర్చులు పెట్టుకుని, రైతులకు మాత్రం రూ.20 వేల నుంచి రూ.22 వేలు చెల్లిస్తున్నాడు. అదే రైతు దింపు తీసి ఒక్క చోట గుట్టగా పెట్టితే కాయల నాణ్యతను బట్టి రూ.25 నుంచి రూ.27 వేలు చెల్లిస్తున్నారు. దింపు, ఒలుపు ఖర్చులు భరించలేని రైతులు నేరుగా వ్యాపారస్తుడికే ఇచ్చేస్తున్నారు.

సాగు విస్తీర్ణం

ఉభయ గోదావరి జిల్లాల్లో సుమారు 70 వేల హెక్టార్లలో కొబ్బరి తోటలు ఉండగా, ఒక్క తూర్పు గోదావరి జిల్లాలో 8,979 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ఇదే కాకుండా చేలగట్లు, పుంత గట్లు, చెరువు గట్లు, లంక భూముల్లో కూడా కొబ్బరి చెట్లు ఉన్నాయి. పెరవలి మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, నడుపల్లి, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఖండవల్లి గ్రామాల్లో సుమారు 400 ఎకరాల్లో సాగవుతున్నాయి.

దక్కని గిట్టుబాటు ధర

ఒక వైపు దిగుబడులు తగ్గుతుంటే మరో వైపు పెరిగిన ధరలు రైతులకు చేరడం లేదు. దళారీలు, వ్యాపారస్తులు కుమ్మక్కవ్వటంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది. వ్యాపారస్తులందరూ సిండికేట్ కావడం, ఎక్కడకు వెళ్లినా ఇవే ధరలు చెప్పడంతో రైతులు చేసేది లేక అయిన కాడికి అమ్ముకుంటున్నారు. దీనితో రైతులకు వెయ్యి కాయలకు కేవలం రూ.20 వేలు మాత్రమే దక్కుతోంది. కొబ్బరి తోటల్లో గతంలో ఎకరానికి 1500 నుంచి 1700 కాయలు పడితే నేడు దిగుబడులు బాగా తగ్గిపోవడంతో 1000 కాయలు మాత్రమే వస్తున్నాయి.

మన కొబ్బరికి డిమాండ్

మార్కెట్‌లో కొబ్బరి ధరలు పెరగడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఈ ఏడాది కుంభమేళా నుంచి ధర పెరుగుదల మొదలైంది. ముఖ్యంగా మన రాష్ట్రంలోనే కాక, కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో కొబ్బరి దిగుబడులు అనూహ్యంగా తగ్గిపోవడం కూడా మరో కారణం. ప్రస్తుతం మహారాష్ట్ర, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఇక్కడ నుంచే ఎగుమతులు జరుగుతున్నాయి. ఇలా మన కొబ్బరికి డిమాండ్ బాగా పెరిగింది.

ఎగుమతులు

ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి గతంలో నిత్యం 400 నుంచి 500 లారీల వరకూ ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు జరిగేవి. కానీ నేడు 200 లారీలకు మించి వెళ్లడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని అంబాజీపేట, పాలకొల్లు కొబ్బరికి ప్రధాన మార్కెట్లు అని చెబుతారు. ఇక్కడ ధర నిర్ణయించిన తర్వాతే ఎగుమతులు జరుగుతాయి. వ్యాపారస్తులందరూ ఈ మార్కెట్‌లో నిర్ణయించిన ధరల ప్రకారమే రైతులకు డబ్బులు చెల్లిస్తారు.

తోటల వద్దకే వ్యాపారులు

గతంలో కొబ్బరి దింపు తీయండి అంటూ వ్యాపారస్తుల చుట్టూ రైతులు తిరిగేవారు. కానీ నేడు రైతుల వద్దకు వ్యాపారస్తులు వస్తున్న పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లో కొబ్బరి కాయలు దొరక్కపోవటంతో పాటు ఇతర రాష్ట్రాల కాయలు లేకపోవటంతో మన కాయలకు డిమాండ్ ఏర్పడింది. దీనితో వ్యాపారస్తులు నెల రోజులకు దింపు తీస్తున్నారు. గతంలో 40 రోజులకు తీయాల్సిన తీత ఇప్పుడు 30 రోజులకే జరుగుతోంది. అంతే కాకుండా రైతులకు ముందుగానే సొమ్ములు ఇచ్చి మరీ దింపు తీసుకుంటున్నారు.

కలసి రాలేదు



మార్కెట్‌లో కొబ్బరికి మంచి ధర పలుకుతున్నా మాకు మాత్రం వెయ్యి కాయలకు నాణ్యతను బట్టి రూ.20 వేల నుంచి రూ.22 వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. ఇదేమిటని అడిగితే ఇష్టం ఉంటే ఇవ్వండి లేకపోతే లేదు అంటున్నారు. కొబ్బరికి డిమాండ్ ఉన్నా మాకు మాత్రం కలసి రావటం లేదు.

– పిల్లా శ్రీనివాస్, రైతు, కొత్తపల్లి అగ్రహారం

దిగుబడి తగ్గింది



కొబ్బరి దిగుబడి పెద్దగా లేకపోవడంతో ధర పెరిగినా మాకు ఉపయోగం ఉండడం లేదు. వ్యాపారస్తుడు చెప్పిన ధరకే కాయలు ఇచ్చేస్తున్నాం. ఎక్కడకు వెళ్లినా వ్యాపారులందరూ ఒకే ధర చెబుతున్నారు. చేసేది లేక వచ్చింది తీసుకుంటున్నాం.

– నందమూరి నారాయణరావు, రైతు, తీపర్రు

కొబ్బరికి డిమాండ్



కొబ్బరికి డిమాండ్ బాగుంది. ఇతర రాష్ట్రాల్లో సరుకు లేకపోవటంతో ఈ ధరలు కొనసాగుతున్నాయి. కానీ ఎంత కాలం ఉంటాయో తెలియదు. అందుకే నిల్వలు వేయటం లేదు. వచ్చిన కాయ వచ్చినట్లు మార్కెట్‌కు తరలిస్తున్నాం.

– అడబాల బ్రహ్మయ్య, కొబ్బరి వ్యాపారి, అన్నవరప్పాడు

నేడు యథాతథంగా పీజీఆర్ఎస్



కలెక్టర్ కీర్తి చేకూరి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ కీర్తి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గతంలో అందజేసిన అర్జీల స్థితిని 1100 నంబర్‌కు కాల్ చేసి తెలుసుకునే అవకాశం ఉందన్నారు.

మైనారిటీ స్కూళ్లకు 27 నుంచి దసరా సెలవులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రభుత్వ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం మైనారిటీ పాఠశాలలకు ఈ నెల 27 నుంచి అక్టోబర్ 2 వరకూ దసరా సెలవులు ఇచ్చినట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు ఆదివారం తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించిన సంగతి విదితమేనని, అక్టోబర్ 3న అన్ని పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు.

దేవీ దర్శనం.. కనుల వైభవం



రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో అమ్మవారిని ప్రతిష్ఠిస్తున్న ఉత్సవ కమిటీ నిర్వాహకులు



విద్యుద్దీపాలతో మెరిసిపోతున్న అమ్మవారి ఆలయం, ఆకట్టుకున్న సెట్టింగ్



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): దసరా శరన్నవరాత్ర ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక సందడి మొదలైంది. ఈ ఉత్సవాల కోసం జిల్లా వ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో విస్తృతంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో అమ్మవారిని ఆదివారం రాత్రి 9.45 గంటలకు ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం కలశ స్థాపన జరుగుతుంది. అనంతరం దసరా ఉత్సవాలు మొదలవుతాయి. ఇక్కడి ఉత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో పేరు గాంచాయి. శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి వివిధ అలంకరణలు చేసి పూజలు నిర్వహిస్తారు. ప్రతి రోజూ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

'ఒకే దేశం ఒకే ఎన్నిక'తో ఆర్థిక ప్రగతి



సమావేశంలో పాల్గొన్న ఎంపీలు బాన్సూరి స్వరాజ్, పురందేశ్వరి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

రాజమహేంద్రవరం సిటీ: ఒకే దేశం ఒకే ఎన్నిక విధానంతో దేశ ప్రగతి సాధ్యమవుతుందని, ఎన్నికల నిర్వహణ ఖర్చు, సమయం కలసి వస్తాయని పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. గోదావరి ఇంటలెక్చువల్ ఫోరమ్ ఆధ్వర్యాన 'వన్ నేషన్ వన్ ఎలక్షన్' అనే అంశంపై ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అధ్యక్షత ఆదివారం నగరంలోని ఓ హోటల్లో సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి న్యూఢిల్లీ ఎంపీ బాన్సూరి స్వరాజ్ ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఒకే దేశం, ఒకే ఎన్నిక అనేది కొత్త విషయం కాదని, 1967 వరకూ ఆ పద్ధతే ఉండేదన్నారు. జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి ప్రమాదం వస్తుందా అనే అనుమానాలు ఉన్నాయని, వాటి నివృత్తికి ఇలాంటి సమావేశాలు దోహదపడతాయన్నారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజకీయ, పరిపాలన పరమైన సంస్కరణలు తెచ్చాక జమిలి అమలు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. న్యూఢిల్లీ ఎంపీ బాన్సూరి స్వరాజ్ మాట్లాడుతూ జమిలి ఎన్నికల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మద్దిపాటి వెంకట్రాజు, వన్ నేషన్ వన్ ఎలక్షన్ కార్యక్రమ రాష్ట్ర కన్వీనర్ వేటుకూరి సూర్యనారాయణరాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కష్టబడి.. గెలిచి

- కేఓ మల్లవరం నుంచి 9 మంది ఉపాధ్యాయులుగా ఎంపిక
- భార్యాభర్తలు, స్నేహితులు, వదినామరదళ్లకు కొలువులు
- జిల్లాలో చివరైనా.. ఉద్యోగాల్లో ముందంజ

తుని రూరల్: వారంతా ప్రాథమిక విద్యను ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిచేసిన వారే.. అయితేనేం ఎంతో కష్టమైనా ఇష్టపడి చదివి అనుకున్నది సాధించారు. ఏ ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడినా ఆ గ్రామంలోని వారు ఉండాల్సిందే.. అంటే ఆ ఊరిలో ఉద్యోగాల కోసం ఎంత కష్టపడి విజయం సాధిస్తారో అర్థం చేసుకోవచ్చు. డీఎస్సీలో ఏకంగా 9 మంది అభ్యర్థులు ఒకేసారి ఉపాధ్యాయులు కావడం నిజంగా మామూలు విషయం కాదు. కాకినాడ జిల్లాలో శివారు గ్రామంగా అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం సరిహద్దుగా ఉన్న కేఓ మల్లవరం యువత ఉద్యోగాలు సాధించడంలో ముందంజ వేస్తున్నారు. ప్రభుత్వం ఏ ఉద్యోగాలు భర్తీ చేసినా అందులో కేఓ మల్లవరం గ్రామస్తులకు భాగస్వామ్యం తథ్యం. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక విద్య అభ్యసించిన విద్యార్థులే కావడం విశేషం. గడిచిన రెండు దశాబ్దాల్లో రెండు వందల మందికిపైగా ఉద్యోగాలు సాధించడం, అందులోనూ అత్యధికులు ఉపాధ్యాయులే కావడం మరో విశేషం. డీఎస్సీ ఫలితాల్లో ఏకంగా తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఎంపికై సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకుని తుది జాబితాలో స్థానం దక్కించుకుని పాఠశాలల్లో విధులు నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నారు.

క్రీడాస్ఫూర్తితో ఆదర్శ విజయం



ప్రభుత్వ పాఠశాలలో క్రీడలతో మొదలైన తమ స్నేహం ఒకరికి మరొకరం ప్రోత్సహించుకుంటూ పెరిగాం. టీచర్ల కావాలన్నదే ఇద్దరి గమ్యం. డీఎస్సీ పరీక్షలకు సైతం కలిసే చదువుకున్నాం. ఉద్యోగాలు సాధించడం మాత్రమే కాదు.. చదువుల్లోనూ, ఆటల్లోనూ ఆడపిల్లలు తీసిపోరన్నది సమాజానికి చెప్పాలనుకున్నాం. కష్టపడి చదివితే గ్రామీణ బాలికలు లక్ష్యాన్ని సాధించగలరని నిరూపించాం.

– చందక శ్రావణి, సుర్ల కృష్ణవేణి (స్నేహితులు)

యువతకు స్ఫూర్తి



స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంటే తలచిన ఆశయం సాధించడం సులభమేనని ఆ దంపతులు నిరూపించారు. నారపాటి నాగేశ్వరరావు, భార్య లీలా శివజ్యోతి జిల్లా డీఎస్సీ ఫలితాల్లో నాగేశ్వరరావు 17వ ర్యాంకు, లీలా శివజ్యోతి రెండో ర్యాంకుతో స్కూల్ అసిస్టెంట్లుగా ఎంపికై ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారు. కష్టాలు, వివాహ బంధాలు లక్ష్యాన్ని చేరుకోవడంలో అడ్డురావని భార్యాభర్తలు నిరూపించారు.

– ఎన్.నాగేశ్వరరావు, లీలా శివజ్యోతి (భార్యాభర్తలు)

తెలుగు, హిందీ ఉద్యోగాల్లోకి వదినామరదళ్లు



2025 డీఎస్సీలో లోకవరపు అప్పలనాయుడు భార్య మంగాదేవి హిందీ, సోదరి శెట్టి కుమారి తెలుగు విభాగాల్లో స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగాలు సాధించారు. ఇద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం మహిళల్లో దాగి ఉన్న శక్తిసామర్థ్యాలను తేటతెల్లం చేసింది. కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు, జీవిత భాగస్వాముల ప్రోత్సాహమే తమ విజయ రహస్యాలుగా పేర్కొన్నారు.

– లోకవరపు మంగాదేవి, శెట్టి కుమారి (వదినామరదళ్లు)

రెండు ఉద్యోగాలు



లోకవరపు శిరీష విభిన్న ప్రతిభ ప్రదర్శించి డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా, ఏపీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయింది. చిన్నప్పటి నుంచి ఎన్నో కష్టాలను చవిచూసిన శిరీష వివాహం జరిగినప్పటికీ కృషి, పట్టుదలతో మొదటి ప్రయత్నంలోనే రెండు ఉద్యోగాలను సాధించింది. పుట్టింట, మెట్టినింట నుంచి ప్రోత్సాహం లభించడం వల్లే ఈ విజయాలను సాధించినట్టు ఆమె పేర్కొన్నారు.

– లోకవరపు శిరీష

ప్రతిబంధకాలే ప్రేరణ



చదువుకునే రోజుల్లో ఎదురైన అడ్డంకులు ప్రతిబంధకాలే ప్రేరణగా, పట్టుదలతో డీఎస్సీలో గణిత విభాగంలో స్కూల్ అసిస్టెంట్‌గా విజయం సాధించాను. చిన్నప్పటి నుంచి అంకెలు, లెక్కలపై ఉన్న మక్కువతో చదువుకుంటూనే వందల మందికి ట్యూషన్లు చెప్పాను. నిరంతర కృషి, ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న తపనతో డీఎస్సీ పరీక్షల్లో లక్ష్యాన్ని చేరుకున్నాను.

– రెడ్డి గంగాధర్

శ్రమతో విజయం



చిన్నతనం నుంచి విద్యలో ఉత్తమ మార్కులు సాధించినప్పటికీ 2018 డీఎస్సీలో అరమార్కుతో ఉద్యోగం చేజారిపోయింది. నిరాశ చెందకుండా ఉపాధ్యాయుడిని అవ్వాలన్న కల 2025 డీఎస్సీలో నెరవేరింది. తల్లిదండ్రులు ఇచ్చిన ధైర్యం, ప్రోత్సాహంతో పాటు తన ప్రతిభ, లక్ష్యంతో ఓపెన్ కేటగిరిలో 89 మార్కులతో ఎస్జీటీ ఉద్యోగాన్ని సాధించాను. మరోసారి విఫలం కాకూడదన్న అసాధారణ శ్రమే గెలిపించింది.

– శెట్టి నాగేశ్వరరావు

కిటకిటలాడిన పాదగయ క్షేత్రం



పాదగయలో భక్తుల రద్దీ

పిఠాపురం: త్రిగయలలో ప్రాధాన్యం కలిగిన పిఠాపురం పాదగయ క్షేత్రం గయాసురుని పాదాలు ఉండడం వల్ల పితృకార్యాలకు అత్యంత విశిష్టమైందిగా పేరొందింది. మహాలయ అమావాస్య కావడంతో ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చి పితృకార్యాలు నిర్వహించారు. మహాలయ పక్షం పితృ దేవతలకు మోక్షం అనే నమ్మకంతో భక్తులు పాదగయ క్షేత్రంలో భారీగా పిండప్రదానాలు చేశారు. దీంతో పాదగయ క్షేత్రం పిండ ప్రదానాలతో కిటకిటలాడింది. ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు పితృదేవతలకు పిండ ప్రదానాలు చేసేందుకు తరలివచ్చారు. తద్వారా ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. పాదగయ క్షేత్రంలో గయాసురుని పాదాలు ఉండడం వల్ల ఇక్కడ పితృకర్మలు చేసి పిండాలు గయాసురిని పాదాలు ఉన్న పాదగయ పుష్కరిణిలో వదిలితే అవి నేరుగా పితృదేవతలకు చేరుతాయని భక్తుల విశ్వాసమని పురాణ గాధలు చెబుతున్నాయి. అన్ని చోట్ల పితృ కర్మలు చేసుకునే వీలు ఉన్నా ఈ క్షేత్రానికి మాత్రం పితృమోక్షకరమైన క్షేత్రంగా పేరుండడంతో ఇక్కడ చేయడానికే ఎక్కువగా ప్రాధాన్యం ఇస్తుంటారు. అందువల్లే ఏటా మహాలయ పక్షంలో ఈ క్షేత్రానికి భారీగా భక్తులు తరలివస్తుంటారు. సాధారణ రోజుల్లో 20 నుంచి 50 వరకు పిండప్రదానాలు జరిగితే మహాలయ పక్షం రోజుల్లో మాత్రం రోజుకు వెయ్యికి పైగా జరుగుతుంటాయి. ఇక అమావాస్య ఆదివారం కావడంతో సుమారు 3 వేల మందికి పైగా భక్తులు పిండప్రదానాలు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

మద్యం సీసాలు, రికార్డులు లేని వాహనాల సీజ్



కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో పాల్గొన్న టూ టౌన్ పోలీసులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఇందులో 32 మద్యం సీసాలు, నాలుగు రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఐదుగురు పాత నేరస్తుల ఇళ్లను పోలీసులు తనిఖీ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక శక్తులను అణిచి వేసేందుకు తెల్లవారు జామున పోలీసు, స్పెషల్ పార్టీ సిబ్బంది సంయుక్తంగా ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.నరసింహకిశోర్ మాట్లాడుతూ జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో రోజూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాలని జిల్లా పోలీసు అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించిన ప్రాంతాల్లో క్షుణ్ణంగా సోదాలు చేసి మద్యం, సారా, గంజాయి, మందు గుండు సామగ్రి, అక్రమ నిల్వలను స్వాధీనం చేసుకుంటున్నామన్నారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులను ఉపేక్షించబోమని, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ దుర్మరణం

దేవరపల్లి: గుండుగొలను – కొవ్వూరు మధ్య 16వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు జిల్లా వెంగళాయపాలేనికి చెందిన లారీ డ్రైవర్ చెరుకూరి నాగమల్లేశ్వరరావు (58) దేవరపల్లి సమీపంలోని డైమండ్ జంక్షన్ వద్ద ఓ హోటల్లో భోజనం చేసి శనివారం రాత్రి 11 గంటల సమయంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ నేపథ్యంలో యర్నగూడెం నుంచి కొవ్వూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో నాగమల్లేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య


గోకవరం: స్థానికంగా ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆ వివరాల ప్రకారం.. స్థానిక సాయి ప్రియాంక లేఅవుట్‌లో ఈక నరసింహులుదొర (39) తన ఇంట్లో ఆదివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దేవీపట్నం మండలం ఎం.రావిలంకకు చెందిన నరసింహులుదొరకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబంతో కలసి ఏడాది క్రితం సాయి ప్రియాంక లేవుట్‌లోకి వచ్చారు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతో ఈ ఘటనకు పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

క్రికెట్ క్రీడాకారుల ఎంపిక వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో కాకినాడ పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 22న జరగాల్సిన అండర్-19 ఎస్‌జీఎఫ్ఐ క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు వాయిదా వేసినట్లు సమాఖ్య అండర్-19 కార్యదర్శి వెంకటరెడ్డి ఆదివారం తెలిపారు. దసరా సెలవుల అనంతరం ఈ ఎంపికలు జరుగుతాయన్నారు.

వైద్యం... మహాభాగ్యం

- క్యాన్సర్‌కు ఆధునిక సేవలు
- వ్యాధిని ముందుగా గుర్తిస్తేనే మేలు
- నేడు వరల్డ్ రోజ్ డే



రాయవరం: క్యాన్సర్... ఈ వ్యాధి పేరు చెబితే చాలా మందికి ఒంట్లో వణుకు పుడుతోంది. ఈ వ్యాధి వస్తే చనిపోవడమే అనే అపోహ ప్రజల్లో ఉంది. గతంలో రాచపుండుగా పిలిచే ఈ క్యాన్సర్‌కు చికిత్స ఉండేది కాదు. వ్యాధిగ్రస్తులు మరణానికి రోజులు లెక్క బెట్టుకుంటూ గడిపేవారు. ప్రస్తుతం పరిస్థితి మారింది. ఆధునిక వైద్యం అందుబాటులోకి రావడంతో వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ ఉన్నవారిలో వ్యాధిపై ఉన్న భయాన్ని పోగొట్టి వారిలో మానసిక ధైర్యాన్ని నింపేందుకు ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 22న రోజ్ డే నిర్వహిస్తున్నారు.

వరల్డ్ రోజ్ డే నేపథ్యమిదీ

కెనడా దేశానికి చెందిన 12 ఏళ్ల మెలిండా రోజ్ అనే బాలిక 1994లో క్యాన్సర్ బారిన పడింది. అది కూడా చాలా అరుదైన బ్లడ్ క్యాన్సర్ కావడంతో, కొన్ని వారాల్లోనే బాలిక చనిపోతుందని వైద్యులు తెలిపారు. దీంతో రోజ్ తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. కానీ రోజ్ ఎటువంటి బాధ లేకుండా, భయపడకుండా ఆసుపత్రిలో ఉన్న రోగులకు గులాబీలు అందిస్తూ, వారికి కవితలు వినిపించి రోగుల్లో మానసిక ఉల్లాసాన్ని కలిగించింది. ఈ విధంగా ఆరు నెలల పాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూనే రోగులను చిరునవ్వుతో పలుకరిస్తూ.. ఉత్తరాలు రాస్తూ వారిని ఆనందింపజేసి సెప్టెంబర్ 22న మరణించింది. రోజ్ జ్ఞాపకార్థం ఏటా రోజ్ డే నిర్వహిస్తున్నారు.

వ్యాధికి కారణాలెన్నో..

ఓరల్ క్యాన్సర్‌కు ప్రధాన కారణం పొగాకు ఉత్పత్తుల వినియోగమే. సిగరెట్, బీడీ, చుట్ట, పాన్ పరాగ్, ఖైనీ, గుట్కా ఇలా ఏ రూపంలో పొగాకు తీసుకున్నా క్యాన్సర్ వస్తుంది. మద్యం తాగడం, వ్యాయామం చేయకపోవడం, ఆకు కూరలు తినకపోవడం, ఊరగాయ పచ్చళ్లు, కొవ్వు ఎక్కువగా ఉన్న మాంసాహారం తినడం, అధిక బరువు ఉండటం వల్ల కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే అవకాశం ఉంది. సంతానం కలగని వారికి, అలాగే జీన్స్ వల్ల బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశముంది. గర్భాశయ ముఖ క్యాన్సర్ వ్యాధి సుఖ వ్యాధుల వల్ల రావొచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే గర్భాశయ ముఖ వ్యాధి క్యాన్సర్‌కు వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది.

రోగులకు భరోసా..

ఎన్నడూ లేని విధంగా గత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్యాన్సర్ రోగులకు భరోసా కల్పించేలా సంస్కరణలు చేపట్టారు. క్యాన్సర్ రోగులకు భరోసా కల్పిస్తూ క్యాన్సర్ ప్రొసీజర్లు పెంచారు. ఆరోగ్యశ్రీ పథకంలో 2019 వరకూ క్యాన్సర్ రోగులకు 223 ప్రొసీజర్లు మాత్రమే చికిత్స అందిస్తుండగా, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 648 క్యాన్సర్ ప్రొసీజర్లకు ఉచితంగా చికిత్స అందించడం ద్వారా రోగులకు ఊరట కల్పించింది.

అందుబాటులో వైద్య సేవలు



క్యాన్సర్‌కు ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే ఇతర సభ్యులకు వ్యాధి వచ్చే అవకాశం ఉందా లేదా నిర్ధారించేందుకు బీఆర్ సీఏ-1, 2 పరీక్షలు ఉన్నాయి. క్యాన్సర్ చికిత్సకు కీమో థెరఫీ, రేడియేషన్ థెరఫీ వంటి వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. భయపడాల్సిన పనిలేదు.

–పి.శ్రీనివాసన్, ప్రొఫెసర్ అండ్ హెచ్ఓడీ, రేడియేషన్ ఆంకాలజీ విభాగం, రంగరాయ వైద్య కళాశాల, కాకినాడ

స్క్రీనింగ్ పరీక్షలతో క్యాన్సర్‌కు చెక్



స్క్రీనింగ్ పరీక్షల ద్వారా క్యాన్సర్‌కు చెక్ పెట్టవచ్చు. ముఖ్యంగా మహిళలు 45 ఏళ్లు దాటాక ప్రతి ఏడాది మెమో గ్రామ్ పరీక్ష చేయించుకోవాలి. 55 ఏళ్లు దాటిన వారు సీటీ స్కాన్, కొలనో స్కోపి చేయించుకోవాలి. తొమ్మిదేళ్ల నుంచి 11 ఏళ్లలోపు బాలికలకు, 45 ఏళ్లలోపు మహిళలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించడం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చు.

–సుమలత, నాన్ కమ్యూనికల్ డిసీజెస్ కోనసీమ జిల్లా కోఆర్డినేటర్

ఏటా 750 కొత్త కేసులు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏటా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో 750 కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రోజుకు 40 నుంచి 50 మంది రోగులు రెగ్యులర్‌గా వైద్య సేవలు పొందుతున్నారు. కాకినాడ జీజీహెచ్‌లో 2001లో ఏర్పాటైన పరికరం ద్వారా రేడియేషన్ ఇస్తున్నారు. పాత మెషీన్ స్థానంలో లీనియర్ యాక్సిలేటర్ ఏర్పాటు చేస్తే క్యాన్సర్ రోగులు ఆధునిక వైద్య సేవలు పొందే వీలుంటుంది. పాత పరిజ్ఞానం ద్వారా రేడియేషన్ చేస్తే ఇతర ఇబ్బందులు అధికమవుతాయి. లీనియర్ యాక్సిలేటర్‌తో రేడియేషన్ ఇస్తే ఇంపార్టెంట్ ఆర్గాన్స్ దెబ్బతినవు. ఆధునిక టెక్నాలజీ ద్వారా 50–60 శాతం ఇబ్బందులు తగ్గుతాయని వైద్యులు చెబుతున్నారు. తద్వారా రోగుల జీవన ప్రమాణం పెరుగుతుంది. ఇప్పుడు జీజీహెచ్‌లో ప్రతి మంగళ, గురువారాల్లో ముందస్తు క్యాన్సర్ లక్షణాల గుర్తింపునకు ఓపీ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు వైద్యులు చెబుతున్నారు.

నిర్ధారణ యూనిట్ అవసరం

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో క్యాన్సర్‌ను గుర్తించి పరీక్షలు నిర్వహించే ఆసుపత్రులు లేవు. పరీక్షల అనంతరం కీమో థెరపీ, రేడియో థెరపీ, అవసరమైన శస్త్రచికిత్సలు చేసే ఆసుపత్రులు ప్రభుత్వ పరిధిలో కాని, ప్రైవేట్ పరిధిలో కాని లేవు. అనుమానిత కేసులనూ ప్రభుత్వ వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలిస్తున్నారు.

జీజీహెచ్‌కు వెళ్లాల్సి రావడం, దూరాభారం కావడంతో గతంలో గుర్తించిన అనుమానిత కేసుల్లో 100 మంది వరకూ పరీక్షలు చేయించుకోలేదు. కనీసం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో క్యాన్సర్‌ను గుర్తించే యూనిట్‌ను ఏర్పాటు చేస్తే మరిన్ని కేసులను గుర్తించే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.

టీడీపీ సానుభూతిపరుడి గూండాగిరి



నాగేశ్వరరావు ఇంటి వద్ద రచ్చ చేస్తున్న టీడీపీ సానుభూతిపరుడి అనుచరగణం

- పేద కుటుంబంపై దాడికి యత్నం
- ఇల్లు కబ్జా చేసేందుకు కుట్ర చేస్తున్నారని ఫిర్యాదు

కాకినాడ క్రైం: తన కుటుంబంపై టీడీపీ సానుభూతిపరుడు దౌర్జన్యానికి పాల్పడినట్లు ఓ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఇంటిని కబ్జా చేసే యత్నంలో భాగంగా బెదిరింపులకు దిగాడని చెబుతున్నాడు. ఆ వివరాల్లోకి వెళితే.. కాకినాడ 28వ డివిజన్‌లోని సూర్యనారాయణపురం జ్యోతులవారి వీధిలో మాన్యం నాగేశ్వరరావు తన కుటుంబంతో కలసి నివాసం ఉంటున్నాడు. అతను సుమారు 15 ఏళ్ల కిందట గుండు సత్యవతిని చేరదీసి ఆలనా పాలనా చూశాడు. దీంతో ఆమె చనిపోయే ముందు (సుమారు రెండేళ్ల కిందట) జ్యోతులవారి వీధిలోని తన 54 గజాల ఇంటిని నాగేశ్వరరావుకు రాసిచ్చింది. దీంతో నాగేశ్వరరావు అక్కడకు మకాం మార్చాడు. ఇదిలా ఉండగా.. ఆ ఇల్లు తనదంటూ కొద్దిరోజుల కిందట టీడీపీ సానుభూతిపరుడు నగరమాని సతీష్ వాదనకు దిగాడు. సత్యవతి కుమార్తె అయిన సామర్లకోటలో నివాసం ఉంటున్న ఊడి పద్మ తనకు ఆ ఇంటిని విక్రయించిందని చెప్పుకొచ్చాడు. దానికి సాక్ష్యంగా కొన్ని పత్రాలు చూపాడు. అయితే అవివాహిత అయిన సత్యవతికి పిల్లలు ఎక్కడి నుంచి వచ్చారని నాగేశ్వరరావు ప్రశ్నించడంతో సతీష్ ఆగ్రహానికి గురయ్యాడు. అక్కడి నుంచి వెళ్లిపోయి, పదిహేను రోజుల తర్వాత ఈ నెల 20న మరోసారి వచ్చి, సుమారు 20 మందితో మూక దాడికి యత్నించినట్లు బాధితుడు చెప్పాడు. వెంటనే స్థానికులు స్పందించి నాగేశ్వరరావు దంపతులను కాపాడారు. దీనిపై బాధితుడు మాట్లాడుతూ అసలు ఊడి పద్మ ఎవరు, సతీష్ చూపుతున్న ఫ్యామిలీ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. పద్మ, సతీష్ అతడి అనుచరులపై తక్షణమే చర్యలు తీసుకుని ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను రద్దు చేయాలని అధికారులకు విన్నవించారు. తనకు జరిగిన అన్యాయంపై ఈ నెల 16న మున్సిపల్ అధికారులు, తహసీల్దార్, 19న కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే ఈ నెల 20 జరిగిన దాడిపై కాకినాడ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వనదుర్గమ్మకు ప్రత్యంగిర హోమం



వనదుర్గమ్మ వారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు



టేకు రథంపై స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి వన దేవత వనదుర్గమ్మ వారికి భాద్రపద అమావాస్య పర్వదినం సందర్భంగా ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత హోమం ప్రారంభించి, హోమ ద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. అమ్మవారికి ప్రసాదాలు నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ప్రత్యంగిర హోమంలో 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి పాల్గొన్నారు. వేద పండితులు యనమండ్ర శర్మ, గంగాధరబట్ల గంగబాబు, వనదుర్గమ్మ ఆలయ అర్చకుడు ప్రయాగ రాంబాబు, పరిచారకులు చిట్టెం వాసు, వేణు, వ్రత పురోహితులు చెల్లపిళ్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

టేకు రథంపై సత్యదేవుని ఊరేగింపు

అన్నవరంలోని వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలోని ఆలయ ప్రాకారంలో సత్యదేవుని రథసేవ నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి పరిచారకులు శివ, గాడేపల్లి పవన్ తదితరులు పూజలు చేశారు. అనంతరం ఊరేగించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరాగా మూడు సార్లు ఆలయ ప్రాకారంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు.

అప్పు ఎగ్గొట్టేందుకే హతమార్చాడు!

- మధ్యవర్తులను బావిలోకి తోసేసిన వైనం
- ఇద్దరి హత్య కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడిని హాజరుపరిచి వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్

పిఠాపురం: అప్పు ఎగ్గొట్టేందుకు పథకం వేశాడు.. ఇందులో ఇద్దరు మధ్యవర్తులను హతమార్చి, ఆపై అప్పు ఇచ్చిన వ్యక్తినీ చంపేయాలని ప్రయత్నించిన ఘటనలో నిందితుడు కటకటాల పాలయ్యాడు. ఈ కేసులో నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ విషయాన్ని గొల్లప్రోలు పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన వెల్లడించారు. ఈ నెల 16న తాటిపర్తిలో ఇద్దరిని హత్య చేసి, ఒక వ్యక్తిపై హత్యాయత్నం చేసిన ఘటనపై గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ వివరాల ప్రకారం.. ఏడాది కిందట తాటిపర్తి గ్రామానికి చెందిన రంపం గంగాధర్ అదే గ్రామానికి చెందిన కుంపట్ల సూరిబాబు వద్ద రుణం తీసుకున్నాడు. ఆ సందర్భంలో తన బంధువులైన రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబులను మధ్యవర్తులుగా పెట్టి అప్పు తీసుకున్నాడు. కొంత కాలంగా అప్పు తీర్చమని సూరిబాబు అడుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో మధ్యవర్తులుగా ఉన్న రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబులపై కుంపట్ల సూరిబాబు ఒత్తిడి తెచ్చాడు. వీరందరూ కలసి అప్పు తీర్చాలంటూ గంగాధర్‌ను అడిగారు. దీంతో ఆ ముగ్గురినీ చంపేస్తే ఇక అప్పు తీర్చాల్సిన అవసరం లేదని భావించిన గంగాధర్ ఓ పథకం రచించాడు. ముందుగా సిద్ధం చేసుకున్న పథకం ప్రకారం ఫ్రైడ్ రైస్ పార్టీ ఇస్తానని చెప్పి మధ్యవర్తులుగా ఉన్న రంపం శ్రీనివాస్, తోరాటి సూరిబాబులను ఫోన్ చేసి రమ్మన్నాడు. వారంతా తాటిపర్తి ఎన్టీఆర్ కాలనీ శివారు మొగిలి చిన్న పొలంలోని బావి వద్దకు వెళ్లి కలసి తింటున్నారు. శ్రీనివాస్, తోరాటి సూరిబాబు ఫ్రైడ్ రైస్ తింటుండగా అదును చూసి వారిని బావిలోకి తోసి హతమార్చాడు. అనంతరం అదేరోజు రాత్రి అప్పు ఇచ్చిన వ్యక్తి కుంపట్ల సూరిబాబును కూడా టీ తాగడానికి గొల్లప్రోలు వెళ్దామంటూ ఫోన్ చేసి రమ్మన్నాడు. అతను వచ్చాక బైక్ ఎక్కించుకుని తాటిపర్తి గ్రామ శివారులోని పుంత రోడ్డులో కొండ కాలువ వాగు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ కావాలనే ముందుగా తన సెల్ ఫోన్ కాలువలో పడేసి కుంపట్ల సూరిబాబును తన సెల్‌ఫోన్ లైట్ వేయాలని అడిగాడు. ఇలా వెతుకుతున్నట్లు నటించి సూరిబాబును కూడా కొండ కాలువలో ముంచి హతమార్చాలని గంగాధర్ ప్రయత్నించాడు.

దీంతో అప్రమత్తమైన సూరిబాబు తప్పించుకుని, తర్వాత రోజు ఉదయం తాటిపర్తి గ్రామానికి వచ్చి జరిగిన విషయాన్ని మృతుల బంధువులకు తెలిపాడు. దీంతో మృతుల బంధువులు వెళ్లి మొగిలి చిన్న పొలంలోని బావిలో చూడగా, ఇద్దరి మృతదేహాలు కనిపించాయి. వెంటనే వారు గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీశ్ పర్యవేక్షణలో పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. రంపం గంగాధర్ విశాఖపట్నం పారిపోయి డబ్బులు అయిపోవడంతో తన మోటార్ సైకిల్ తాకట్టు పెట్టి డబ్బులు తీసుకుని మళ్లీ దూరంగా వెళ్లిపోవడానికి పిఠాపురం రైల్వే స్టేషన్‌కు రాగా, అతనిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు ప్రారంభం



పోటీల ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర చైర్మన్ వెంకటేశ్వరరావు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం అంతర్ జిల్లాల మోడ్రన్ పెంటాథలాన్, బయాథలాన్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన మోడ్రన్ పెంటాథలాన్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పెంటాథలాన్ అనే ఒలింపిక్ క్రీడ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఏడాది మోడ్రన్ పెంటాథలాన్ పోటీలు డీఎస్ఏలో జరుగుతున్నాయని, వీటిని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గౌరవ అధ్యక్షుడు హరిబాబు, రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ మాట్లాడారు. ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బీఎస్ఎస్ కుమారి, కోచ్ కట్టా జగన్ మోహన్ కిశోర్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీనివాస్, వి.మాచరరావు, ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి ప్రసాద్, బీఎస్‌వీఎస్ ప్రసాద్, డీఎస్ఏ స్విమ్మింగ్ కోచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

తిరుపతికి విమాన సేవలు



మధురపూడిలో విమానాశ్రయం

అక్టోబర్ ఒకటి నుంచి ప్రారంభం

కోరుకొండ: మధురపూడిలోని విమానాశ్రయం నుంచి తిరుపతికి విమాన సేవలు ప్రారంభిస్తున్నట్లు ఎయిర్ పోర్టు డైరెక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఎలయన్స్ ఎయిర్ సంస్థ ఏటీఆర్ 72 విమానం అక్టోబర్ ఒకటో తేదీ ఉదయం 7.40 గంటలకు తిరుపతి నుంచి బయలుదేరి 9.25 గంటలకు రాజమహేంద్రవరం వస్తుందన్నారు. తిరిగి 9.50 గంటలకు ఇక్కడి నుంచి బయలుదేరి మధ్యాహ్నం 11.20 గంటలకు తిరుపతి చేరుతుందన్నారు. ప్రతి మంగళ, గురు, శని వారాల్లో ఈ విమాన సేవలు ఉంటాయని వివరించారు. కాగా.. గతంలోనే తిరుపతికి మధురపూడి నుంచి విమాన సర్వీసు ఉండేది. కొంత కాలం తర్వాత ఆగిపోయింది. తిరిగి పునః ప్రారంభం అవుతోంది.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్



జెడ్.భావారంలో గంజాయి నిందితులను అదుపులోకి తీసుకుంటున్న తహసీల్దార్ దుర్గాప్రసాద్, ఎస్ఐ సునీత

కరప: గంజాయి కేసులో ఇద్దరు నిందితులను కరప పోలీసులు అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచారు. పోలీసుల కథనం ప్రకారం.. కరప మండలం జెడ్.భావారం గ్రామానికి చెందిన గుణ్ణం రాజశేఖర్ ఇంటి వద్ద కొంతమంది గంజాయి విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, కరప ఎస్ఐ టి.సునీత రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో కలసి వెళ్లేసరికి నిందితులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పోలీసులు పట్టుకుని, విచారించగా అసలు విషయం బయటపడింది. గుణ్ణం రాజశేఖర్ అనే వ్యక్తి వెన్నపు లక్ష్మీగణపతి (గణేష్)కు డబ్బులు ఇచ్చి కిలో గంజాయి కావాలని అడగ్గా తన వద్దలేదని, తన స్నేహితుడు వాసంశెట్టి బన్ని వద్ద తీసుకు ఇస్తానని చెప్పాడు. ఆ తర్వాత బన్నీ ప్రస్తుతం తన వద్ద గంజాయి లేదని రామచంద్రపురంలోని చెల్లూరి మణికంఠ (లడ్డు) వద్ద ఉందని అన్నాడు. ఈ నెల 20న జెడ్.భావారంలోని రాజశేఖర్ ఇంటి వద్ద గంజాయిని నిందితులు పంచుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 3.174 కిలోల గంజాయిని కరప ఎస్ఐ సునీత సీజ్ చేశారు. ఒక చానల్‌లో పాత్రికేయుడిగా చలామణి అవుతున్న రాజశేఖర్ (ప్రథమ నిందితుడు) గణేష్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి, ప్యాకెట్లుగా చేసి అమ్ముతున్నాడు. మరో నిందితుడు వాసంశెట్టి బన్నీపై రామచంద్రపురంలో గంజాయి కేసు నమోదైంది. నిందితులు రాజశేఖర్, వాసంశెట్టి బన్నీకి సహకరిస్తున్న సత్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని, కాకినాడ కోర్టులో ప్రవేశపెట్టారు. పోలీసులు తొలుత నలుగురిని అరెస్ట్ చేయగా, ఇద్దరినే అరెస్ట్ చూపడం అనుమానాలకు తావిస్తోంది. నిందితులు గణేష్, మణికంఠ, బన్నీ పరారీలో ఉన్నట్లు చెబుతున్నారు.

అంతర్జాతీయ నాటక ప్రదర్శనకు శ్రీప్రకాష్ విద్యార్థులు



ప్రదర్శనకు పయనమైన విద్యార్థుల బృందం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): శ్రీప్రకాష్ కాకినాడ సినర్జీ స్కూల్ విద్యార్థులు కజకిస్తాన్ దేశంలో విభిన్న ప్రదర్శనలు ఇవ్వడానికి ఆదివారం పయనం అయ్యారు. వీరు కజకిస్తాన్ వర్సిటీ, షిమ్‌కెంట్లో, కజకిస్తాన్ తాష్కెంట్, ఉజ్బెకిస్తాన్ యూనివర్సిటీలలో ప్రదర్శనలు ఇవ్వనున్నారు. నటుడు, దర్శకుడు, విద్యావేత్త నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా పూర్వ విద్యార్థి కుమార్ సుమిత్ రూపకల్పన, దర్శకత్వంలో కింగ్‌లియర్, జూలియస్ సీజర్ వంటి క్లాసిక్ స్పియర్ నాటక ప్రదర్శనతో ప్రతిభ చూపనున్నారు. విద్యార్థులు సి.సాయిశృతి, ఎస్.ఐశ్వర్య, పి.దక్షిత, ఎస్.షణ్ముకి, కె.శ్రీసాన్వి, ఎం.ఫణి, పి.మణిరాజు, ఎండీ ఇబ్రహీం, డి.అహిల్, పి.శ్రీచరణ్‌రాజ్, సి.నమిత ఆర్యన్, జె.వివేక్‌ల బృందం వెళ్లారు. 23వ తేదీ మంగళవారం అల్‌మాటి టీజీ కజక్ నేషనల్ అకాడమీలో ఆఫ్ ఆర్ట్స్‌లో కింగ్ లియర్ ప్రదర్శన, 24వ తేదీన జూలియస్ సీజర్, 25న భారత రాయబార అధికారులు, విద్యార్థులతో సమావేశం, 28న షిమ్‌కెంట్‌లో నజర్‌బాయేవ్ ఇంటలెక్చువల్ స్కూల్లో కింగ్ లియర్ గ్రాండ్ షో, 29న అదే స్కూల్లో జూలియస్ సీజర్ ప్రదర్శన, అక్టోబర్ 1న తాష్కెంట్‌లో ప్రదర్శన ఉంటుందని పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ వివరించారు.

ఉత్సాహంగా జిమ్నాస్టిక్స్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జిమ్నాస్టిక్స్ జిల్లా స్థాయి పోటీలు ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వీటిని ఎన్‌సీఎస్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణ మురళీ, డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ ప్రారంభించారు. అండర్-6, 7, 8, 10 విభాగాల్లో బాలురు, బాలికల ఫ్లోర్ ఎక్సర్‌సైజ్, టేబుల్ వాల్ట్, బ్యాలెన్సింగ్ బీమ్ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ క్రీడల్లో రాణించేవారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. డీఎస్ఏ జిమ్నాస్టిక్స్ కోచ్ సురేష్ పర్యవేక్షణలో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో జిమ్నాస్టిక్స్ సంఘ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.